

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 30-05-2026 | సంపుటి - 28 | సంచిక -04 | రూ : 4 | పేజీలు: 8


## ఇందిరమ్మ గృహాలే రిఫరెండం



- పట్టణాల్లో అవసరమైతే పదంతస్తుల భవంతులు
- జూన్ 1న మరో 2.5 లక్షల గృహాల నిర్మాణాలు ప్రారంభం
- కేటీఆర్.. మీకు నేను విసిరిన సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా.. లేదా?
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో




## ఇకపై 10 రోజులకోసారి
# కార్యకర్తలను కలుస్తా

- రా ప్రజాప్రతినిధులు వారంలో ఒకరోజు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే
- సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారమేనా.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల గురించి చెప్పరా?
- పీసీసీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి చురక

హైదరాబాద్: ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ తరువాయి 2లో



## ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ.. జైలుకు తరలింపు

మూడు రోజుల పాటు భగీరథ్ ను ప్రశ్నించిన పోలీసులు

2లో




## కాక్రోచ్ జనతా పార్టీ
# ఖాతా నిలిపివేత..


- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించిన హైకోర్టు

2లో

## త్వరలో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు?
# ఆర్‌బీఐ చర్చలు..!

- భారీగా పెరిగిన పేపర్ కరెన్సీ ముద్రణ ఖర్చు
- సవాల్‌గా మారిన చిరిగిన నోట్ల నిర్మూలన
- పరిష్కారంగా ప్లాస్టిక్ నోట్లపై ఆర్బీఐ చర్చలు
- తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక
- త్వరలోనే పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభానికి యోచన

2లో





## నీట్ రీ-టెస్ట్ ప్రశ్నపత్రాల రవాణాకు
# ఇండియన్ ఎయిర్‌ఫోర్స్?

- జూన్ 21న నీట్ రీటెస్ట్ నిర్వహణ
- నేరుగా పర్యవేక్షిస్తున్న ప్రధాని కార్యాలయం
- ప్రశ్నపత్రాల రవాణా బాధ్యత వాయుసేనకు ఇచ్చే యోచన
- పౌర పాలనా వ్యవస్థలు విఫలమని విమర్శలు

2లో

## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు
# 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

- తెలంగాణలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు
- హైడ్రా సంస్థలో... కబ్జాల తొలగింపు విధుల్లో నియామకం
- 'హైడ్రా ఈగిల్ టీమ్' పేరుతో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ
- ఈ ఉద్యోగం తమకు గౌరవం, ఆత్మవిశ్వాసం ఇచ్చిందని వెల్లడి
- వారి పనితీరుపై అధికారుల ప్రశంసలు

2లో





## మే 31న ఆకాశంలో అరుదైన దృశ్యం
# హైదరాబాద్‌లోనూ చూడొచ్చు!

- కనువిందు చేయనున్న బ్లూ మైక్రోమూన్
- ఒకే నెలలో రెండో పౌర్ణమిగా రాక
- హైదరాబాద్‌లో సాయంత్రం వీక్షించేందుకు ఉత్తమ సమయం
- సాధారణ పౌర్ణమి కంటే కాస్త చిన్నగా కనిపించనున్న చంద్రుడు

2లో

# ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా

హైదరాబాద్: ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ''మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, సీనియర్ నాయకులు వారంలో ఒకరోజు నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలను కలవాలి. నాతో సహా ఎవరు ఎక్కడికి వెళ్లాలనేది పీసీసీ అధ్యక్షుడు నిర్ణయిస్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ క్యాడర్.. సోషల్ మీడియా వారియర్లుగా మారి పార్టీ కోసం పనిచేశారు. కానీ, ఇప్పుడు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ప్రచారం చేసుకోవడమే తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనీయడం లేదు. పార్టీ కోసం సోషల్ మీడియా వినియోగంపై ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వాలి.

**'సర్'పై సమన్వయంతో పనిచేయాలి..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) పై పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి. నేతలు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు పోలింగ్ బూత్ స్థాయిలో పనిచేస్తారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించాలి. నగర పరిధిలోని 15 నియోజకవర్గాలవారీగా 'సర్'పై సమావేశాలు పెట్టాలి. మహిళా కాంగ్రెస్ తరపున క్లస్టర్ల వారీగా భేటీలు నిర్వహించాలి. 'సర్'లో భాగంగా ఓట్ల తొలగింపుతో సామాన్యులు, పేదలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం. లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చు. దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యలకు పరిష్కారంపై అందరూ సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి.

*** అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..**

గతంలో డిజిటల్ విధానంలో ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం. అప్పుడు కీలకపాత్ర పోషించిన వారిని ఇప్పుడు 'సర్' కార్యక్రమంలో పనిచేసేలా పరిగణనలోకి తీసుకోవాలి. 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 'సర్' పర్యవేక్షణకు ఇన్‌ఛార్జులను నియమించాలి. అసెంబ్లీ ఇన్‌ఛార్జులు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. ఈ విషయంలో పీసీసీ మాజీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. దాదాపుగా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేశాం. పార్టీ తరఫున ఇప్పుడు వేల మంది సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. వలస పోయిన వారి ఓట్లు తొలగించకుండా వారంతా జాగ్రత్తలు తీసుకోవాలి'' అని సీఎం చెప్పినట్లు పార్టీ వర్గాలు వివరించాయి. 'సర్' విషయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై మంత్రులు, ఇతర నేతలు తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా చెప్పారు. ఒక నాయకుడు మాట్లాడుతుండగా.. సీఎం కల్పించుకుని ముందు గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు?, పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకాలు ఇంకా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించినట్లు తెలిసింది.

## ఇందిరమ్మ గృహాలే రిఫరెండం

హైదరాబాద్: ఇందిరమ్మ గృహాలు రిఫరెండంగా వచ్చే శాసనసభ ఎన్నికలు ఉంటాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గృహనిర్మాణశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'పదేళ్లలో పట్టణాల్లో భారాస నిర్మించిన గృహాల కన్నా... కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ నిర్మిస్తుంది. హైదరాబాద్‌లో భారాస కంటే ఎక్కువ ఇళ్లు కడితేనే నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పా. కాంగ్రెస్ ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటారా అని మీకు (కేటీఆర్‌కు) సవాల్ విసిరా. మీకు ఈ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా.. లేదా? గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల విషయమై మాట్లాడే ధైర్యం లేకపోగా.. హైదరాబాద్‌లోని గృహాల అంశంపై సవాల్ చేస్తే స్వీకరించకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు దిల్లీలో భాజపా నేతల ముందు మోకరిల్లారు. కేసుల మాఫీ కోసం కాషాయ నేతల కాళ్లు పట్టుకున్నారు. ధరణి దందాలు, బినామీ బాగోతాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలు చేశారు. 2014కు ముందు మీ ఆర్థిక పరిస్థితి... పదేళ్లలో ఎంత దోచుకున్నారో అందరికీ తెలుసు. గ్రామాల్లో పదేళ్లలో కట్టిన ఇళ్ల కన్నా మూడు రెట్ల ఎక్కువ గృహాలు కాంగ్రెస్ రెండేళ్లలో కట్టింది'' అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన నమూనా డిజైన్లు పరిశీలించి మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా పది అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ''చిత్తశుద్ధితో రెండున్నరేళ్లలో గ్రామాల్లో 4.5 లక్షల గృహాల నిర్మాణాలు ప్రారంభించాం. జూన్ 1న మరో 2.5 లక్షల గృహాల నిర్మాణాలు ప్రారంభిస్తాం. హైదరాబాద్‌లో తొలివిడతలో లక్ష గృహాలు నిర్మించనున్నాం.

**వాస్తు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వండి**

దేశానికి ఆదర్శంగా అర్బన్ హౌసింగ్ నమూనాను తెస్తున్నాం. పట్టణాల్లో నివసించే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించాలి. రానున్న 40, 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలి. మౌలిక సదుపాయాలు కీలకం. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలి. వాస్తు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వండి. పార్కింగ్‌తో పాటు షాపులకు అవకాశం ఉండాలి. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో గృహాలు నిర్మించాలి. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తుది డిజైన్లు ఖరారు చేసి, యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తాం'' అని మంత్రి పొంగులేటి తెలిపారు.

## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు...

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది. ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు,ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. "గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్విరాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు. ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

## నీట్ రీటెస్ట్ ప్రశ్నపత్రాల రవాణాకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్?

ఢిల్లీ : మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనలో పడింది. ఈ నేపథ్యంలో జూన్ 21న జరగబోయే రీటెస్ట్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఏకంగా భారత వాయుసేన సాయం తీసుకోవాలని విద్యా శాఖ యోచిస్తున్నట్లు సమాచారం. ప్రధాని కార్యాలయం స్వయంగా ఈ పరీక్షా నిర్వహణను పర్యవేక్షిస్తుండటం గమనార్హం.

**రంగంలోకి ఎయిర్‌ఫోర్స్?**

గతంలో నీట్ పరీక్ష పత్రాలను తపాలా శాఖ, సాధారణ రవాణా వ్యవస్థల ద్వారా తరలించేవారు. అయితే ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే మధ్యలోనే పేపర్ లీకైనట్లు సీబీఐ విచారణలో తేలింది. ఈ లోపాలను అరికట్టడానికి భారత వాయుసేన విమానాల ద్వారా ప్రశ్నపత్రాలను ఆయా రాష్ట్రాల ప్రధాన కేంద్రాలకు చేరవేయాలని భావిస్తున్నారు. దీనితోపాటు జూన్‌లో వాతావరణ మార్పులు ఉండే అవకాశం ఉండటంతో వాయుసేన ద్వారా రవాణా చేయడమే సురక్షితమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

**విమర్శిస్తున్న నిపుణులు**

పరీక్షల నిర్వహణ కోసం సైన్యాన్ని రంగంలోకి దింపాలనే ఆలోచన దేశంలోని పరిపాలనా యంత్రాంగం, పోలీస్ వ్యవస్థల వైఫల్యాన్ని సూచిస్తోందని పలువురు రక్షణ రంగ నిపుణులు విమర్శిస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో ఎక్కువ శాతం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండటం వల్లే ఇలాంటి లీకేజీలు జరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థలోని లోపాలను సరిచేయకుండా సైన్యాన్ని రంగంలోకి దించడం కేవలం ప్రచారం కోసమేనని ప్రతిపక్షాలు కూడా విమర్శిస్తున్నాయి.

## మే 31న ఆకాశంలో అరుదైన దృశ్యం..
## హైదరాబాద్‌లోనూ చూడొచ్చు!

హైదరాబాద్ : నగరవాసులతో పాటు దేశవ్యాప్తంగా ఖగోళ ప్రియులు మే 31న ఒక అరుదైన దృశ్యాన్ని వీక్షించబోతున్నారు. ఆ రోజు ఆకాశంలో 'బ్లూ మైక్రోమూన్' కనువిందు చేయనుంది. ఒకే నెలలో రెండోసారి పౌర్ణమి రావడం, అదే సమయంలో ఈ ఏడాదిలోనే చంద్రుడు అత్యంత చిన్నగా కనిపించనుండటం దీని ప్రత్యేకత. 2026 మే నెలలో రెండు పౌర్ణములు సంభవిస్తున్నాయి. మొదటి పౌర్ణమి మే 1న రాగా, రెండోది మే 31న రానుంది. సాధారణంగా ఒకే క్యాలెండర్ నెలలో రెండోసారి వచ్చే పౌర్ణమిని 'బ్లూ మూన్' అని పిలుస్తారు. అలాగే, మే 31న చంద్రుడు భూమికి అత్యంత దూరంలో (అపోజీ) ఉండనున్నందున దీనిని 'మైక్రోమూన్' అని కూడా అంటున్నారు. ఇలా బ్లూ మూన్, మైక్రోమూన్ రెండూ ఒకేసారి రావడం చాలా అరుదు. ఈ బ్లూ మైక్రోమూన్ సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే 67 శాతం చిన్నగా, కొంచెం తక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తుంది. అయితే, పేరులో 'బ్లూ' ఉన్నప్పటికీ చంద్రుడు నీలం రంగులో కనిపించడు. ఇది కేవలం ఒక ఖగోళ నామకరణం మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్‌లో మే 31న సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య తూర్పు వైపు ఆకాశంలో దీన్ని స్పష్టంగా చూడవచ్చు. వాతావరణం అనుకూలిస్తే ఎలాంటి ప్రత్యేక పరికరాలు లేకుండానే కళ్లతో ఈ అద్భుతాన్ని వీక్షించవచ్చు. ఈ సమయంలో చంద్రుడు స్కార్పియస్ రాశిలోని ప్రకాశవంతమైన అంటారిస్ నక్షత్రానికి సమీపంలో కనిపిస్తాడు.

## త్వరలో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు? ఆర్‌బీఐ చర్చలు..!

ఢిల్లీ : దేశంలో త్వరలోనే ప్లాస్టిక్ (పాలిమర్) కరెన్సీ నోట్లు చలామణిలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నగదుకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) ఈ దిశగా అడుగులు వేస్తోంది. ఇటీవల పట్నా, ముంబై నగరాల్లో జరిగిన బోర్డు సమావేశాల్లో ప్లాస్టిక్ నోట్లపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం వాడుతున్న కాగితపు నోట్లతో పోలిస్తే వాటి ముద్రణ ఖర్చు తక్కువగా ఉండటం, ఎక్కువ కాలం మన్నడమే ఇందుకు కారణం.

**పెరిగిన ముద్రణ ఖర్చులు**

గత ఆర్థిక సంవత్సరంలో కరెన్సీ నోట్ల ముద్రణ కోసం ఆర్‌బీఐ ఏకంగా రూ.6,372.8 కోట్లు ఖర్చు చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది చాలా పెరిగింది. కొత్తగా తీసుకురాబోయే ప్లాస్టిక్ నోట్లను సులభంగా విత్‌డ్రా చేసుకునేలా ఏటీఎం యంత్రాల్లోనూ అవసరమైన సాంకేతిక మార్పులు చేయనున్నారు. ఇందుకోసం త్వరలోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ నోట్లను విడుదల చేసేందుకు ఆర్‌బీఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నా మార్కెట్లో నగదు చలామణి రికార్డు స్థాయిలో రూ.42.86 లక్షల కోట్లకు చేరింది.

**చిరిగిన నోట్ల సవాల్**

మార్కెట్లో పాడైపోయిన, చిరిగిపోయిన నోట్లను సేకరించి వాటిని నిర్మూలించడం ఆర్‌బీఐకి సవాలుగా మారింది. గత ఏడాదిలోనే సుమారు 23.8 బిలియన్ల పాత నోట్లను వెనక్కి తీసుకుంది. ఇందులో ఎక్కువగా రూ.500, రూ.100 నోట్లే ఉన్నాయి. ప్లాస్టిక్ నోట్లు వస్తే ఈ సమస్య చాలా వరకు తగ్గుతుంది. గతంలో 2012లో యూపీఏ ప్రభుత్వం ఐదు నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మకంగా తీసుకురావాలని చూసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ అప్పట్లో ఆగిపోయింది. కానీ ఇప్పుడు పూర్తి స్థాయి సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది.

## మహిళా సంఘాల సభ్యులు
## పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళా సంఘాలు ఇకపై వ్యాపార సంఘాలుగా మారాలని.. సభ్యులంతా వాణిజ్య, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి కోటీశ్వరులు కావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. 'మేడ్ ఇన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్' నినాదం ద్వారా గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను శాసించాలని అన్నారు. మహిళా సంఘాలను చైతన్యవంతం చేసేందుకు త్వరలో మహిళల ముచ్చట లేదా మహిళల మాట పేరిట రేడియోను ప్రారంభిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కుమురంభీం ఆదివాసీభవన్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో వీహబ్, టీహబ్, బిట్స్ పిలానీల సహకారంతో ఇంక్యుబేటర్ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ''మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా పరిశ్రమలను స్థాపించే స్థాయికి ఎదిగి ఆర్థిక సాధికారత సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంలో భాగంగా 300 మంది మహిళా సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలను చేసేందుకు రెండు ఇంక్యుబేటర్‌లు ప్రారంభిస్తున్నాం. ఒక్కోదానికి రూ.10.70 కోట్ల చొప్పున కేటాయించాం. ఈ కేంద్రాల ద్వారా ఎంపిక చేసిన వారికి బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తాం. ఆర్థిక, వ్యాపార మార్గనిర్దేశం చేస్తాం. ఈ పథకం కింద పరిశ్రమలు స్థాపించే మహిళా సంఘాల సభ్యులు 1,200 మందికి ఉద్యోగాలు కల్పిస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో 6.43 లక్షల మంది మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.. వారి వ్యాపారాలను మరింత విస్తరిస్తాం'' అని పేర్కొన్నారు. సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, టీహబ్, వీహబ్‌ల సీఈవోలు కవికృత్, సీత, బిట్స్ పిలానీ డైరెక్టర్ శ్రీరాం, ఇతర అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## కాక్రోచ్ జనతా పార్టీ ఖాతా నిలిపివేత..

ఢిల్లీ : మన దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజా సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో యువత, సెలబ్రిటీలు ఈ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ఈ పార్టీ ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపి వేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎక్స్ ఖాతాను నిలిపివేయడంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ ఖాతాను ఎక్స్ నిలిపి వేసిందంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. ఈ సందర్భంగా అభిజిత్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... ఎక్స్ ఖాతా నిలిపివేయడం ద్వారా పార్టీ కార్యకలాపాలు, ప్రజలతో సంబంధాలు దెబ్బతింటున్నాయని కోర్టుకు తెలిపారు. వెంటనే పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని కోరారు. ఈ వాదనలపై కోర్టు స్పందిస్తూ... తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి, ఎక్స్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా కేంద్ర ప్రభుత్వం, ఎక్స్ సంస్థ తమ సమాధానాలను సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది.

## ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ.. జైలుకు తరలింపు

హైదరాబాద్: మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారు బండి భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. భగీరథ్ ను పోలీసులు మూడు రోజుల పాటు విచారించారు. విచారణ ముగియడంతో భగీరథ్ ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు ప్రత్యేక విచారణాధికారి, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో పోలీసులు భగీరథ్‌ను విచారించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసేందుకు మొయినాబాద్ ఫామ్ హౌస్‌కు కూడా ఆయనను తీసుకెళ్లారు. డిసెంబర్ 31న బాధితురాలిని భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్ హౌస్‌కి తీసుకెళ్లి అఘాయిత్యం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అయితే పోలీసు విచారణలో పలు ప్రశ్నలకు భగీరథ్ సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉన్నట్టు సమాచారం.

# పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాల పై అవగాహన



కూసుమంచి, ప్రజా స్పూర్తి : కూసుమంచి మండలంలోని రావి చెట్టు తండా గ్రామంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాలు వాటిని ఏ విధంగా భూమిలో కలియదున్నాలి అనే అంశంపై రైతులకు వివరించడం జరిగింది. అనంతరం నిషేధిత హెచ్ టి పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలు, విచక్షణా రహితంగా ఎరువులను వాడటం వలన కలిగే అనర్థాలు , నానో ఎరువుల వినియోగం , నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించడం జరిగింది. గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కానీ, మరెవరైనా వ్యక్తులు గాని విత్తనాలను అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లయితే వ్యవసాయ శాఖ వారికి వెంటనే సమాచారం అందించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ సరైన వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే పత్తి విత్తనాలను విత్తుకోవాలని పొడి వాతావరణంలో విత్తుకుంటే భూమి పొరలలోని వేడికి గింజలు మొలకెత్తవని తద్వారా గింజలపై పెట్టే ఖర్చు అధికమవుతుందని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ ,సాయిరాం, రైతులు పాల్గొన్నారు.


# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

*** ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అర్థ నగ్నంగా నిరసన ప్రదర్శన**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ఆటో కార్మికులు శుక్రవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి బస్టాండు సెంటర్ వరకు అర్ధ నగ్నంగా ఆటోలకు తాడుకట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న ఆటో కార్మికులపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోయలేని భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు డీజిల్ ధర పెంచి ఆటో కార్మికుల నడ్డివిరిచారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాలను తగ్గించి, కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణ, అబ్బులు, మంద శ్రీను, బాబు జానీ, ఆరెల్లి, కృష్ణ, రాంబాబు, దేశి, బడుగు భాస్కర్, చింటూ, లక్ష్మణ్, సంపత్, విజ్జి, మండల రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నాని ప్రైవేట్ థియేటర్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పెళ్లి రోజు, పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి మిని ఎసి థియేటర్ ను ఏర్పాటు చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలో కుడకుడ జడ్పీ హైస్కూల్ ఎదురుగా నాని ఎసి ప్రైవేట్ థియేటర్ మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోగుపర్తి శివ సాయి ఆధ్వర్యంలో ఎసి మిని ప్రైవేటు థియేటర్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఎసి హోమ్ థియేటర్ చిన్న చిన్న ఫంక్షన్ లు చేసుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్, ఇండేన్ గ్యాస్ యజమాని తోట శ్యామ్ ప్రసాద్ కమల దంపతులు, సుధాబ్యాంకు వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, ఎండి పెద్దిరెడ్డి గణేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్ ,జూలకంటి నాగరాజు, డోకుపర్తి ప్రవీణ్, డోగుపర్తి మల్లేష్ ,సాయి తేజ రాచూరు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, తో కలిసి తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జూన్ 2న జరుపుకొనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య,



ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి,కలెక్టరేట్ ఏవో అంజి రెడ్డి,మునిసిపల్ కమిషనర్ లు, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజల కోసం పోరాడిన నాయకుడి కుటుంబానికి తోడుగా నిలిచిన వ్యక్తి సమ్మిగౌడ్, సామల నర్సయ్య




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం సిపిఐఎం న్యూ డెమోక్రసీ నాయకుడు, భారత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ కన్మంత రెడ్డి భాస్కర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తన స్వగ్రామం ఈదుల పూసపల్లి లో అంత్యక్రియలు నిర్వహించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో, కార్మికుల హక్కుల సాధనలో నిరంతరం పోరాడిన భాస్కర్ రెడ్డి మరణం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు.భాస్కర్ రెడ్డి కుటుంబ పరిస్థితిని పార్టీ జిల్లా నాయకుడు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో సమ్మి గౌడ్ అందుబాటులో లేకపోయినా, విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున భాస్కర్ రెడ్డి గారి కుటుంబానికి తక్షణ సహాయం కింద ఒక క్వింటాల్ బియ్యాన్ని పంపించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకుడు కామ్రేడ్ షేక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# టీకా కోసం వేడుకున్నా పట్టించుకోలేదంటూ రైతు ఆవేదన



కూసుమంచి, ప్రజా స్పూర్తి: మండలంలోని పెరికసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని దేవల తండాకు చెందిన రైతు అజ్మీర మంగ్యకు చెందిన చూడు గేదె గాలికుంటు వ్యాధి బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. సుమారు రూ.50 వేలకుపైగా విలువ చేసే గేదె ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళన చెందుతోంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత గోపాలమిత్రకు సమాచారం అందించి టీకా వేయాలని పలుమార్లు కోరినా, "వస్తాం, చూస్తాం" అంటూ కాలయాపన చేశారని రైతు అజ్మీర మంగ్య ఆరోపించారు. సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో గేదె పరిస్థితి మరింత విషమించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంపదే జీవనాధారంగా ఉన్న తమలాంటి చిన్న, సన్నకారు రైతులకు ఒక్క పశువు అనారోగ్యానికి గురైనా భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేయడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సేవలు అందించడం పశుసంవర్ధక శాఖ బాధ్యత అని గ్రామస్తులు పేర్కొన్నారు.గాలికుంటు వ్యాధి గ్రామంలో ఇతర పశువులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉన్నందున వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేయాలని, బాధిత రైతుకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య సిబ్బంది పనితీరును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




# ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి

*** అర్హులందరి పేర్లు నమోదు చేయడమే లక్ష్యం: సీఈఓ సుధర్శన్ రెడ్డి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతున్నారని చెప్పారు. ఓటర్లు ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ లో భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, బీఎల్వోలు, సూపర్వైజర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ కె.హరిత**



ప్రజా స్పూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: జిల్లాలోని రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ ప్రాంతంలో జూన్ 1వ తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం బహిరంగ సభస్థలి ఏర్పాట్లను ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మంచిర్యాల, ఖానాపూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, వెడ్మ బొజ్జు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, భారీ కేడింగ్, ప్రముఖులు వచ్చే రూట్లు ఇతర అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. బహిరంగ సభ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయ సంఘాలకు రుణాల పంపిణీ



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళ వారోత్సవాల కార్యక్రమంలో జన్నారం మండల కేంద్రంలోని వసుంధర మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం రోజున మహిళా సంఘాలకు 10 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను, ప్యాడి కమిషన్ ఎనిమిది లక్షలు, ర్యామ్ ల్యాంబ్ 4 లక్షలు, పిఎంఎఫ్ఎంఈ రెండు లక్షల రూపాయల చెక్కులను అధికారులు,రాజకీయ నాయకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు నాయక్, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసివుల్లా, నాయకులు ముజాఫర్ అలీ ఖాన్, గుర్రం మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్ టౌన్ ప్రెసిడెంట్ మంద రాజేష్, మండల సమాఖ్య అధ్యక్షులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మూడు ప్రీ – ప్రైమరీ పాఠశాలలకు గ్రీన్ సిగ్నల్

లింగాల ఘణపురం/ జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలలానికి మూడు పూర్వ ప్రాథమి క (ప్రీ - ప్రైమరీ) పాఠశాలలు మంజూ రైనట్లు మండల విద్యాశాఖ అధికారి పడాల విష్ణుమూర్తి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మండలం లోని ఎంపీపీఎస్ లింగాల ఘణపురం, ఎంపీ పీఎస్ నెల్లుట్ల, ఎంపీపీఎస్ కల్లెం పాఠశాలల్లో జూన్ 12 వ తేదీ నుంచి అడ్మిష న్లు ప్రారంభం కానున్నాయని అన్నారు. కావున తల్లిదండ్రులు సంబం ధిత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయు లను సంప్రదించి మీ చిన్నారులకు ప్రవే శాలు కల్పించుకొవచ్చని సూచించారు. ప్రతి పాఠ శాలకు రూ.1 లక్ష చొప్పున నిధులు మంజూరు చేయగా, వాటితో ప్రత్యేక తరగతి గదులను ఆకర్షణీయం గా తీర్చి దిద్దనున్నట్లు తెలిపారు. చిన్నారుల కోసం ఇండోర్, అవుట్ డోర్ ఆట వస్తువులు కూడా అందుబాటు లో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.ప్రీ ప్రైమరీ తరగతుల్లో కనీసం 25 మందికి పైగా విద్యార్థులను చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. చిన్నారుల అభ్యాసానికి అనుగుణంగా ఆకర్షణీయ మైన పుస్త కాలను ప్రభుత్వం అందించ నుండగా, ఉపాధ్యాయులకు ప్రత్యేక హ్యాండ్ బుక్స్ కూడా సమకూర్చనున్న ట్లు వెల్లడించారు.

# వినియోగదారుడి సమస్య పరిష్కరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భార్యాభర్తల తగాదాలు, కుటుంబ కలహాలే కాకుండా వినియోగదారుల సమస్యలను కూడా రాజీమార్గంలో పరిష్కరిస్తానంటుంది. మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ. మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, బయ్యారం గ్రామానికి చెందిన కందుకూరి హరీష్ ఆన్‌లైన్ ద్వారా రూ. 18,452/ విలువగల థామ్సన్ ఫీనిక్స్ గూగుల్ టీవీ ని గత సంవత్సరం కొనుగోలు చేశారు. అయితే, కంపెనీ మెకానిక్ వచ్చి టీవీని ఇన్‌స్టాల్ చేసిన కేవలం మూడు రోజులకే అది పనిచేయడం ఆగిపోయింది. టీవీ మదర్ బోర్డు దెబ్బతిన్నట్లు గుర్తించిన కంపెనీ మెకానిక్ దానిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ మార్చలేదు. దీనిపై బాధితుడు పలుమార్లు కంపెనీ వినియోగదురుల సేవా కేంద్రాన్ని సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీనితో హరీష్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను ఆశ్రయించాడు.కేసు ను పరిశీలించిన




సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శాలిని షాకెల్లి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.నోటీసులు అందుకున్న ప్రతివాదులు (కన్సల్టింగ్ రూమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఫ్లిప్‌కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు) స్పందించారు. బాధితుడికి జరిగిన నష్టానికి గాను పరిహారంగా వారు శనివారం జిల్లా న్యాయ సేవధికార సంస్థ సమక్షంలో రూ. 23,543/ (ఇరవై మూడు వేల ఐదు వందల నలభై మూడు రూపాయలు) మొత్తానికి సంబంధించిన చెక్ ను హరీష్ కు అందజేశారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ సెలెక్షన్స్ 2026




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: అండర్ 9,15 బాల, బాలికలకు చెస్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గండూరి కృపాకర్, ఎల్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 31వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ సెలెక్షన్స్ బాల, బాలికలకు స్థానిక (టి. టి. డి ) కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు పంపించబడతారని , షీల్డ్స్, ప్రశంసా పత్రాలు అందిస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగం క్రీడాకారులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. వివరాలకు ఎల్ సతీష్ కుమార్ కార్యదర్శి, చరవాణి నెం. 9394753343 సంప్రదించాలని తెలిపారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం మహబూబాబాద్ మండల కేంద్రానికి గాను పట్టణ కేంద్రానికి కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ 122 చెక్కులను సీఎంఆర్ఎఫ్ 44 చెక్కులను లబ్ధిదారులకు అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగుల్ జ్యోతి రమేష్ నాయక్,మహబూబాబాద్ మండల అధ్యక్షులు ,అదేవిధంగా వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ సీనియర్ నాయకులు లబ్ధిదారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన గల్ఫ్ కార్మికులు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన ఒడ్డేటి మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందాడు.మృతుడు మల్లేష్ నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో రోటి గూడ గల్ఫ్ కార్మికుడు ఉప్పు సురేష్ గ్రామ గల్ఫ్ కార్మికుల దృష్టికి తీసుకువెళ్లగా వారు రూపాయలు 32,500 జమ చేసి శుక్రవారం రోజున మృతుడి భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు మాట్లాడుతూ, ఒడ్డేటి మల్లేష్ కుటుంబానికి సహాయం చేయడం తమ సామాజిక బాధ్యతలో భాగమని, ఇలాంటి సహాయ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు. ఈ సామాజిక సేవా కార్యక్రమంలో రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యస్తాపకుడు సేపూరి గోపాల్ ,అధ్యక్షుడు ఉప్పు తిరుపతి ,ఉపాధ్యక్షుడు పులిశెట్టి లవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలాజీ శ్రీనివాస్ ,అకౌంటెంట్ ఉప్పు మల్లేశం ,ప్రచార కార్యదర్శి ఒడ్డేటి రమేష్, సలహాదారు ఉప్పు కిరణ్ ,ఉప్పు నరేష్ ,పులిశెట్టి భగత్ ,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ యువజన నాయకుడు బందెల ప్రేమ్ సాగర్ అన్నారు.శుక్రవారం రోజున పొనకల్ పాక్స్ కార్యాలయంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడి దాన్యం అక్కడే కుప్పలు పోసి ఉన్న అకాల వర్షాల వల్ల తడిసి ముద్దవుతున్న పట్టించుకోవడంలేదని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెలన్నర దాటుతున్న రకరకాల కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తుందని, ఒకవైపు ఎండలు మరోవైపు వానలతో కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు తీరని గోసపడుతున్నారని, ధాన్యం కొనుగోలులో జాప్యం, సంచులు కొరత, రవాణా ఇబ్బందులతో అన్నదాతలు రోడ్డున పడ్డారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేసి గోదాములకు తరలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దుమల్ల ఎల్లయ్య, కొండపల్లి మహేష్, ఐలవేణి రవి, కొండకూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సత్వర సేవలందించేందుకు డాక్టర్లు కృషి చేయాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : శుక్రవారం కలెక్టర్ బి చంద్రశేఖర్ తన చాంబర్లో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పని తీరుపై ఆయన జిజిహెచ్ పర్యవేక్షకులు నేత నరసింహారావు, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మాతృ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ , ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్ లతో సమీక్షించారుప్రస్తుతం అందుబాటులో ఉన్న మానవనరులు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలనువినియోగించుకుంటూ ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గల కార్యాచరణనురూపొందించాలని , ఆస్పత్రిలోని అన్ని విభాగాల ద్వారా సత్వర సేవలతో పాటు ,మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి లోని వివిధ విభాగాలలో అవసరమైన వైద్య సామాగ్రి కొనుగోలుకుగాను ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అల్ట్రా సౌండ్, స్కానింగ్, ఇతర పరీక్షల సమయంలో రోగులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా సాధ్యమైనంత త్వరగా పంపించేందుకు గల పద్ధతులను పరిశీలించాలని, అనవసరంగా కాలయాపన చేయకుండా వచ్చిన పేషెంట్లకు పరీక్షలు నిర్వహించి అవసరమైన పరీక్షల ద్వారా వారికి ఉన్న జబ్బులను తెలియజేసి ఖచ్చితమైన చికిత్స అందించేందుకు కృషి చేస్తే ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. ఆస్పత్రిలో అవసరమైన వైద్య పరికరాలకు సంబంధిత వైద్య నిపుణులతో మాట్లాడి అవసరమైన సామాగ్రిని తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు గాను తక్షణమే ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్రస్థాయికి పంపించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రి అభివృద్ధి సంస్థ కమిటీని క్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# మేడ్చల్ జిల్లా భట్రాజు మహిళా, యువజన సంఘం పడమర శాఖ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :మేడ్చల్ జిల్లా భట్రాజు మహిళా, యువజన సంఘం (పడమర శాఖ) నూతన కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని కృషి హై స్కూల్ లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూరపాటి కరుణాకర్ రాజు, లోలబట్టు కృష్ణంరాజుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో మహిళా సంఘం నూతన కమిటీ సభ్యులుగా ఏనుగుధాటి పరమేశ్వరిని అధ్యక్షురాలుగా, కూరపాటి పద్మావతి, ఉడిముడి సత్యవాణిలను ఉపాధ్యక్షులుగా, వినుకొండ హరిణిని ప్రధాన కార్యదర్శిగా, కల్వరాల బట్టు లావణ్యను సంయుక్త కార్యదర్శిగా, తంగెళ్ళ సుజాతను కార్యనిర్వాహక కార్యదర్శిగా, భల్లం ఉషారాణిని కోశాధికారిగా, వడాలి సీత, వ్యాసభట్టు సంతోషిలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. యువజన సంఘం నూతన కమిటీ సభ్యులుగా భల్ల కరుణాకర్ రాజును అధ్యక్షునిగా, సరస్వతి గిరిధర్ రాజును ఉపాధ్యక్షునిగా, వరకవి సురేందర్ రాజును ప్రధాన కార్యదర్శిగా, తంగెళ్ల ప్రేమ్ సాయి భట్, ఉడుమూడి సాత్విక్ వర్మ, బొల్లేపల్లి నాగరాజులను కార్యదర్శులుగా, భల్లం మౌనిక సాయిని కార్యనిర్వాహక కార్యదర్శిగా, సరస్వతి నిఖిల్ రాజు, నన్నపురాజు సాయికిరణ్ రాజు, వ్యాసభట్టు యశ్వంత్ రాజులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు చక్రాల రేవతి నంద్ భట్, జిల్లా ఉపాధ్యక్షులు తంగేళ్ల రాధాకృష్ణ భట్, వి. రాఘవ రాజు, కే. వెంకటేశ్వర రాజు, బి. కృష్ణార్జున రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పోరంకి శ్యామ్ ప్రసాద్ రాజు, కార్యదర్శి డి. దురేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి


*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించడం లో వైద్యులు, సిబ్బంది బాధ్యత తో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ సందర్శించి ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి రోజూ ఓపి కి రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని, రోగులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు సంబధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారని,పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందరూ రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకొని, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ నెలలో పీహెచ్‌సీలో ఎన్ని ప్రసవాలు జరిగాయనీ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎన్ని డెలివరీలు నమోదయ్యాయనీ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు మరింత పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రజల్లో ప్రభుత్వ దవాఖానలపై విశ్వాసం పెంచాలని అన్నారు. ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) రోగులను ఎలా ట్రాక్ చేస్తున్నారనీ అడిగి తెలుసుకున్నారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నిరంతరం ఫాలో అప్ నిర్వహించాలని సూచించారు.ప్రతి నెల పీహెచ్‌సీల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామని, అందులో సిబ్బంది పనితీరుకు రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత వైద్య సిబ్బందిపైనే ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్,డాక్టర్లు,సిబ్బంది,సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# పచ్చి రొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

*** కలెక్టర్ బి చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు .శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పచ్చి రొట్ట ఎరువుల విత్తనాల అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చి రొట్ట ఎరువులను సబ్సిడీపై అందజేస్తున్నదని , జీలుగ విత్తనాలు కిలో 163.50 రూపాయల చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం కిలోకు 81.75 పైసలు సబ్సిడీ ఇస్తుందని, సబ్సిడీ తర్వాత రైతు కిలోకు 81.75 పైసలు చెల్లించాల్సి ఉంటుందని, 30 కిలోల బ్యాగు 2,452.50 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే జనుము విత్తనాలకు సంబంధించి కిలో 155.60 ధర ఉండగా, ప్రభుత్వం కిలోకు 77.75 రూపాయల సబ్సిడీ ఇస్తుందని, తక్కిన 77.75 పైసలు రైతు చెల్లించి కొనాల్సి ఉంటుందని, 40 కేజీల జనుము విత్తనాల బ్యాగును రైతులు3110 రూపాయలు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల సాంద్రత పెరుగుతుందని, అలాగే నేలలో శక్తి, సారవంతం పెరుగుతాయని, తద్వారా పంట దిగిబడి పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల రైతులు వచ్చిరోట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా జిల్లాకు 3500 క్వింటాళ్ల జీలుగ, 500 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయని, వీటిని జిల్లాలోని వివిధ మండలాలకు పంపడం జరిగిందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, లక్ష్మయ్య ,ఇతర ప్రజా ప్రతినిధులు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చకండి పర్యావరణాన్ని పాడు చేయకండి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న గిరక బావి గూడెంలో రైతులు వరి కొయ్యలను పొలంపైనే తగలబెడుతున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు. వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. సాంద్రత పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని ఆ భారం కూడా రైతుల పైన పడుతుందని అన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కోయ్యలను తగలబెట్ట వద్దన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో వరి కొయ్యలను తగలబెట్టడం వలన ప్రాణాపాయం సంభవించిన విషయాలను ఆయన గుర్తు చేశారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకుగాను వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు . ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంట ఉన్నారు.

# భూభారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భూ భారతి రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తులు ఎస్ ఐ ఆర్ మీసేవ అప్లికేషన్స్ పెండింగ్, కోర్టు కేసులు, ధాన్యం కొనుగోలు, వీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మండల తహసీల్దార్ లను ఆదేశించారు.శుక్రవారం వీసీ హాల్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి మండల తాసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి, రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు, మీ సేవలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు.భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. ఎస్ ఐ ఆర్ కోర్టు కేసులు, జనాభా గణన పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ,రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, మండల తహసీల్దార్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వలిగొండ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ పోలీస్ స్టేషన్ ను శుక్రవారం జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు శాంతి భద్రతలను కాపాడడం ప్రజలకు రక్షణగా నిలబడడమే పోలీసుల కర్తవ్యం అని శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు అదేవిధంగా పెట్రోలింగ్ ప్రజా ఫిర్యాదులపై సిబ్బందికి కీలక ఆదేశాలు ఇచ్చారు ఇంకా స్టేషన్ పనితీరు సిబ్బంది క్రమశిక్షణ అత్యవసర సమయాల్లో స్పందించే విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు అలాగే స్టేషన్లోని రిసెప్షన్ కౌంటర్ క్రైమ్ విభాగం ఇంకా జనరల్ డైరీ నిర్వాహనను ఎస్పీ నిశితంగా పరిశీలించారు పోలీస్ స్టేషన్ చెందిన పెట్రోల్ కార్లు ఇంకా బ్లూ కోల్ట్స్ (బీసీ) వాహనాల స్థితిగతులను వాటి సంసిద్ధతను తనిఖీ చేశారు ఇంకా వాహనాలలో సైరాన్లు కమ్యూనికేషన్ చెట్లు జిపిఎస్ వ్యవస్థల పనితీరును అడిగి తెలుసుకున్నారు అలాగే పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై ఎస్పీ సమీక్ష నిర్వహించి దర్యాప్తును వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలలో బ్లూ కోల్ట్స్ మరియు పెట్రోల్ వాహనాలు నిరంతరం గస్తీ కాశి ప్రజలలో పోలీసులపై నమ్మకం పెంచేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఇంకా స్టేషన్కు వచ్చే బాధితులకు తక్షణమే సహాయం అందించాలని అర్హత గల ఫిర్యాదులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని అన్నారు అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణ లో లేదా విధుల్లో నిర్లక్ష్యం వయిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

# సురక్షిత మాతృత్వానికి సమయాను కూల సేవలందించాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : గర్భిణీ స్త్రీలకు సమయానుకూల వైద్యసేవలు అందించి సురక్షిత మాతృత్వాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మహిళా సంక్షేమ వారోత్సవాల కింద నిర్వహించిన "ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ బలమైన బాల్యానికి 1000 మెట్లు"కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీని 12 వారాల్లోపు నమోదు చేసి కనీసం నాలుగు ఏఎన్సీ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గర్భిణీలకు పోషకాహారం, ఐరన్, కాల్షియం మాత్రలు , అవసరమైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలను ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, హెచ్బీ, షుగర్, హెచ్ఐవి, అల్ట్రా సౌండ్ వంటి పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవానంతరం మొదటిపాలు శిశువుకు ఇవ్వాలని, ఆరు నెలలవరకు తల్లి పాలే అందించాలని తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా గర్భిణీల ఆరోగ్య సంరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డీడబ్ల్యూఓ, సీడీపీఓలు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, గర్భిణీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: తెలంగాణలో మహిళా సాధికారతకు వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మెదక్ పట్టణంలోని గాంధీ నగర్ ఏరియాలో నిర్మాణం తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనుల సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈ ఈ నరసింహులు తో కలిసి పనుల పురోగతి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో మంజూరై ఇందిరాస్ మహిళా శక్తి భవనం నిర్మాణం చేపట్టి తుది దశకు చేరుకుందని ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు ఈ పరిశీలనలో పంచాయతీ రాజ్ ఈఈ నరసింహులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ ఓట్లను తొలగించే విధంగా బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలి

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : నకిలీ ఓట్లను తొలగించే విధంగా బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమింపబడిన నేపథ్యంలో హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు సన్నాహక సమావేశాన్ని స్థానిక హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలకు సంబంధించి స్థానిక నాయకులకు పలు సలహాలు సూచనలు తెలియజేయడంతో పాటు గ్రామ కమిటీలు, మండల కమిటీలు బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో చేపట్టబోయే సర్ కార్యక్రమం పై అవగాహన సదస్సు సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పై కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఓట్ల తొలగింపు జరగకుండా చూడాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరూ ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలను ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి తో పాటు వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 31న జరిగే ఉద్యమకారుల ప్రతినిధి సభను జయప్రదం చేయాలి

* **ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న**




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : ఈనెల 31న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సభకు ఉద్యమకారులు అందరు హాజరై జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఉద్యమకారుల ఫోరం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టేందుకు ఉద్యమకారులను గుర్తించేందుకు కేకే కంపెనీ వేయడం హర్షనీయమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేకే కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం కేకే కమిటీ ముఖ్య నాయకులు ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులతో భేటీలో పాల్గొని ఉద్యమకారుల ఫోరం నాయకుల సలహాలు సూచనలు స్వీకరిస్తారు. కావున ఉద్యమకారులందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య, జిల్లా కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, కదిరేణి స్వామి,మల్లం వెంకటేశం,బొడిగే సుదర్శన్,ఐటి పాముల పుష్పమ్మ, ఎక్కల దేవి శ్రీనివాస్, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు

# శునకాలయంగా మారిన సర్వజన వైద్యశాల

**ఆస్పత్రుల్లో వీధికుక్కల సంచారం**
**భయాందోళనలో రోగులు**
**ఇటీవలే కుక్కల దాడిలో మహిళ మృతి**






ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలో వీధికుక్కల సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. కొత్తగూడెం పట్టణంతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో వీధుల్లో ఆడుకునే పిల్లల వెంట కుక్కలు పరుగులు తీయడం తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది. ఇటీవల వీధికుక్కల దాడులు పెరగడంతో పలువురు గాయపడగా, కొన్ని ఘటనల్లో ప్రాణనష్టం కూడా సంభవిస్తోంది. అయినప్పటికీ మున్సిపల్ కార్పొరేషన్, గ్రామపంచాయతీ అధికారులు మాత్రం సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

* **ఆస్పత్రుల్లోకే కుక్కలు**

జిల్లా కేంద్రంలోని సర్వజన ప్రభుత్వ వైద్యశాలతో పాటు రామవరం మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోనూ వీధికుక్కల సంచారం రోగులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. ఆస్పత్రి ప్రాంగణం నుంచి వార్డుల వరకు కుక్కలు తిరుగుతూ పడుకుంటున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు "ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందో"నన్న భయంతో గడుపుతున్నామని వాపోతున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత లోపం, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు వీధికుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

**కుక్కల దాడిలో మహిళ మృతి**

లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీలో ఈనెల 25న జరిగిన ఘటన స్థానికులను కలచివేసింది. కాలనీకి చెందిన ఎం. రాములమ్మ(40)పై వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన వీధికుక్కల సమస్య ఎంత ప్రమాదకర స్థాయికి చేరుకుందో స్పష్టంగా చూపుతోందని ప్రజలు అంటున్నారు. ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేసి, అనంతరం సమస్యను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**"సెక్యూరిటీ గార్డులు ఉన్నా ప్రయోజనం ఏమిటి..?"**

ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ వీధికుక్కలు మాత్రం విచ్చలవిడిగా తిరుగుతున్నాయని రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. పేషెంట్లు వైద్యులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తే వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, ఆస్పత్రిలోకి వస్తున్న కుక్కలను మాత్రం అడ్డుకోవడం లేదని ఆరోపిస్తున్నారు."రోగుల భద్రతకన్నా క్రమశిక్షణ పేరుతో వారిపై ఆగ్రహం చూపించడం తప్ప, అసలు సమస్యలపై దృష్టి పెట్టడం లేదు" అంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# రెబ్బెనలో హోరెత్తిన వివోఏల సమ్మె.. అండగా కార్మిక సంఘాలు



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: రాష్ట్రవ్యాప్తంగా వివోఏలు చేపట్టిన సమ్మె ఎనిమిదవ రోజుకు చేరుకున్న నేపథ్యంలో, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని గౌతమి మండల సమాఖ్య కార్యాలయం ముందు వివోఏలు పెద్ద ఎత్తున సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న వివోఏలు, గ్రామీణ పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేర్చడంలోనూ, మహిళలను సంఘటితం చేసి బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంలోనూ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అయితే ప్రభుత్వం వారికి కేవలం ఐదు వేల రూపాయలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం గౌరవ వేతనాన్ని రద్దు చేసి నెలకు ఇరవై ఆరు వేల రూపాయల కనీస వేతనం చెల్లించాలని, ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన కనీస వేతనాలను వీరికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉద్యోగ భద్రత, భవిష్య నిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, గ్రాట్యుటీ, ఇరవై ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు, పింఛను సౌకర్యం కల్పించడంతో పాటు, వీరిని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఉద్యోగులుగా గుర్తించి మానవ వనరుల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో సంఘం జిల్లా అధ్యక్షుడు భీమేష్, ప్రతినిధులు రవి, కృష్ణ, రజిత, సురేఖ, శ్రీనివాస్, తిరుపతి, లక్ష్మి, సులోచన, నసీమ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితుడికి ఎమ్మెల్యే గండ్ర అండ



జయశంకర్ భూపాలపల్లి , ప్రజాస్ఫూర్తి : 8వ వార్డు జవహర్నగర్ కాలనీకి చెందిన మల్లెల మల్లారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన కుటుంబానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎల్వోసీ (LOC) ద్వారా ఆర్థిక సహాయం అందించారు. ఇప్పటికే రూ.1.50 లక్షల విలువైన ఎల్వోసీ మంజూరు చేయించామని, అవసరమైతే మరింత సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. మల్లెల మల్లారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.




# గంజాయి హాట్ స్పాట్స్ లపై ప్రత్యేక నిఘా

* **మత్తు పదార్థాలు రవాణా చేసిన, సేవించిన కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేసే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.. సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. డయల్ 100 నకు ఫోన్ రాగానే త్వరితగతిన స్పందించి బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ,కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, జిల్లాలోని సిఐలు,ఎస్సైలు , సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్ లతో కలిసి వందేమాతర గీతం ఆలపించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రజలకు అందించే పౌష్టిక ఆహారం, ప్రజల ఆరోగ్యంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ జిల్లా వైద్య పరంగా అభివృద్ధికి కృషి చేసి రోగులకు మెరుగైన సేవలు ఖండించాలని తెలిపారు. జిల్లాలో 464 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి జిల్లా అధికారులు ఒక్కొక్కరిని దత్తత తీసుకొని, నెలకు సరిపడా మందులు, పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు, మత్తుకు బానికై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, నషా ముక్త్ భారత్ వైపు అడుగులు వేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని, స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమాజంలో జరిగే అరాచకాలపై మౌనంగా ఉండొద్దని, ప్రజా వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఆకాంక్షిత జిల్లాలో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో శాఖల వారీగా చేపడుతున్న సేవలు, సంక్షేమ అభివృద్ధి పనులపై గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్.పి. నితికా పంత్ జిల్లాలో శాంతి భద్రతల పట్ల, మాదకద్రవ్యాల చర్యలపై వివరించారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్, ఎస్.పి., జిల్లా అధికారులు స్వాగతం పలికిన అనంతరం రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకున్న కలెక్టర్ కు ధృవపత్రం ప్రధానం చేశారు. రాష్ట్ర గవర్నర్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి లకు జిల్లా అధికారులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అక్రమ ఔట్సోర్సింగ్ నియామకాలపై విచారణ జరిపించాలి

* **బిఆర్ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు వాడపల్లి నవీన్ ఫిర్యాదు**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ జిట్టా బాలకృష్ణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ,యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు.రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా, పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా, అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ రిజిస్ట్రార్‌కుపలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ, గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్ పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు.అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దుచేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ జిట్టా బాలకృష్ణ రెడ్డి గారు విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి, ఈ అంశంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగోని శివ,రాజేష్,యశ్వంత్,రామ్,జితేందర్,సంజీవ,నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## టాస్క్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే గండ్ర సర్టిఫికెట్లు అందజేత



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నైపుణ్యాభివృద్ధి కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. టాస్క్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. టాస్క్ వంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న సాంకేతిక, ప్రాయోగిక నైపుణ్యాలను సమర్థంగా వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని, స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను "చేయూత" యాప్‌లో నమోదు చేసుకోవాలి



ప్రజాస్ఫూర్తి , కూకట్ పల్లి : కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వ రూపొందించిన "చేయూత" యాప్‌లో నమోదు చేసే కార్యక్రమం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ముఖ గుర్తింపు ఫోటోలు సేకరించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.ఆర్.కె పాప గౌడ్, రిసెర్చ్ పర్సన్ జానకి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అధికారులు తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో కొన సాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రి యను మరింత వేగవంతం చేసి, రైతు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారు లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా స మీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవె న్యూ) బెన్షాలోంతో కలిసి ధాన్యం కొను గోళ్ల ప్రక్రియ పై సంబంధిత అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం రవా ణా కోసం అదనంగా ట్రాక్టర్లు, లారీలు వినియోగంలోకి తీసు కురావాలని, అవసరమైతే ఇసుక ట్రాక్టర్లను కూడా రవాణాకు వినియోగించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం లో అవసర మైన హమాలీలు, వాహనాలు సిద్ధంగా ఉంచి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియను లక్ష్యాల వారీగా నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా లోని అన్ని కొను గోలు కేంద్రాలను అధికారులు నిరంత రం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. రవాణా, గోదాముల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పై అధికారులు అప్ర మత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ భాస్క ర్, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, పౌరసరఫరాల సంస్థ డీ.ఎం హతిరామ్, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, డీఏ ఓ అంబికా సోనీ, ఏఎం వీఐ మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.


## సరస్వతి అంత్య పుష్కరాల్లో ఆధ్యాత్మిక వైభవం

* **త్రివేణి సంగమం వద్ద నవరత్న మాలా హారతి వీక్షించిన మంత్రి శ్రీధర్‌బాబు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా శుక్రవారం ఎనిమిదో రోజు కాళేశ్వరం త్రివేణి సంగమం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన 'సరస్వతి నవల నవరత్న మాలా హారతి' భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, మాజీ సీఎస్ శాంతికుమారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి, దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ, ఈవో మహేష్‌లతో కలిసి మంత్రి వీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలకు విచ్చేసి భక్తులను ఆశీర్వదించిన స్వరూపానంద స్వామీజీకి రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న పుష్కరాలు తెలంగాణకు ఆధ్యాత్మిక మహోత్సవంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని, స్వామివారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ.. "ఇక్కడి వాతావరణం చూస్తుంటే హిమాలయాల్లో ఉన్నామా అనిపిస్తోంది" అంటూ ప్రభుత్వ ఏర్పాట్లను కొనియాడారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదుల త్రివేణి సంగమంతో ఈ అంత్య పుష్కరాలకు విశిష్టత చేకూరిందన్నారు. కాశీ స్థాయిలో హారతులు, అలంకరణలు చేయడం విశేషమని ప్రశంసించారు. కాళేశ్వరం దేవాలయాన్ని వేములవాడ, బాసర స్థాయిలో అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పం గొప్పదని పేర్కొన్నారు. త్రయోదశి ప్రదోషకాలంలో, మాస శివరాత్రి సందర్భంగా హారతి వీక్షించడం అత్యంత పుణ్యఫలదాయకమని తెలిపారు. జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయమని, సమాజంలో ఆస్తిక భావనలు పెరిగి యువత భారత సంస్కృతికి వెన్నెముకగా నిలవాలని ఆశీర్వదించారు.

## పేద ప్రజలకు అండ కాంగ్రెస్ ప్రభుత్వం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి సహకారంతో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం,కాచనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రామన్నపేట గ్రామానికి చెందిన సురబాక నాగమణి కి 44,000 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కును అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా కాచనపల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్షిక రాజు, బొమ్మల పాండు రాజు, ఎస్.కె యూసఫ్ మాట్లాడుతూ ఆర్థిక పరమైన ఇబ్బందులతో గురవుతున్న ప్రతి పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బచ్చల వెంకటేష్ ,స్వర్ణపాక లింగరాజు, పర్షిక రామ్ పంజాల రాజేష్, గ్రామ పెద్దలు ముఖ్య నాయకులు ఎమ్మెల్యే కి, కాంగ్రెస్ ప్రభుత్వనికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతులకు ఇబ్బందులు కలగొద్దు.. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి

**: ఎస్పీ సంకీర్త్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,. ప్రజాస్ఫూర్తి : రైతుల నుంచి పారదర్శకంగా వడ్ల కొనుగోలు చేపట్టి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లులో వడ్ల నిల్వలు, ప్రాసెసింగ్ విధానం, రోజువారీ కొనుగోలు సామర్థ్యంపై యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వడ్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులు ధాన్యం తరలింపులో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మిల్ యాజమాన్యానికి ఆదేశించారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులను స్థానిక పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతుల వివరాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు వరిపల్లి అనిల్ కుమార్ కు ఆహ్వానం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అంకితభావం, పట్టుదల ఉంటే మారుమూల గ్రామం నుండి అయినా ప్రపంచ స్థాయికి ఎదగవచ్చని నిరూపిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ యువ నాయకుడు, రచయిత వరిపల్లి అనిల్ కుమార్. తెలుగు భాష, సాహిత్యంపై ఆయనకున్న మక్కువ నేడు ఆయనను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ వేదికపై నిలబెట్టింది. వచ్చే నెల జూన్ 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా వైభవంగా జరగనున్న "7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల"కు అనిల్ కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది.

**అంతర్జాతీయ వేదికపై మహబూబాబాద్ ముద్ర!**

చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, అంతర్జాతీయ సాహిత్య సంస్థ "శ్రీశ్రీ కళావేదిక" ఆధ్వర్యంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నారు. దేశ విదేశాల నుండి ప్రముఖ కవులు, రచయితలు తరలివచ్చే ఈ మహాసంగమంలో మహబూబాబాద్ జిల్లా నుండి వరిపల్లి అనిల్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం మన ప్రాంతానికే గర్వకారణం.

**తెలుగు భాషా కీర్తిని చాటేందుకే.**

చైతన్య సారస్వత పరిషత్ అధ్యక్షులు శ్రీ కె.వి.వి. సత్యనారాయణరాజు (శ్రీ చైతన్యరాజు) సౌజన్యంతో, సాహిత్య భూషణ్ శ్రీ కత్తిమండ ప్రతాప్‌కుమార్ సారథ్యంలో ఈ సభలు జరగనున్నాయి. "తెలుగు కేవలం భాష కాదు.. అది ఒక జాతి సంస్కృతి" అనే సంకల్పంతో జరుగుతున్న ఈ ఉత్సవంలో పాల్గొనాల్సిందిగా శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు అనిల్ కుమార్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఒక మారుమూల గ్రామం నుండి ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రపంచ వేదికపై మెరవబోతున్న యువ నాయకుడు,రచయిత వరిపల్లి అనిల్ కుమార్ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ప్రజలు, యువత మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

*** కలెక్టర్ బి చంద్రశేఖర్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అంతేకాక ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వకార్యక్రమాల విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 64 కుక్కల ప్రేమికులకు కుక్క పిల్లలను దత్తత ఇచ్చారు.కుక్క పిల్లల దత్తత పై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జంతువులలో కుక్క అత్యంత విశ్వాసమైనదని అన్నారు. వీటినిమనంకాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు..నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుక్కలను దత్తతగా పొందినవారువాటిని కాపాడుకోవాలని ,వాటిని వీధిలోకి వదలకుండా ఇంట్లోనే పెంచుకోవాలని, సమయానికి వాటికి ఆహారం అందిస్తూ చక్కగా పెంచుకోవాలని సూచించారు. ప్రజలు కుక్కల పట్ల అవగాహన పెంచుకోవాలని, కుక్క కాటుకు గురికాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, కార్పొరేటర్లు తదితరులు హాజరయ్యారు.

# గని ప్రదేశంలో కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

**– కార్మిక సమస్యలపై జీఎంతో గుర్తింపు సంఘం చర్చలు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని, ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తగిన సంక్షేమ సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు కల్పించడం యాజమాన్య బాధ్యత అని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్లైన్‌లో శుక్రవారం మైన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, గని పరిసరాల్లో ఉన్న మౌలిక సదుపాయాల లోపాలు, భద్రతా అంశాలు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన విషయాలపై నాయకులు యాజమాన్యంతో చర్చించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్ నాయకత్వం వహించగా, సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికుడు ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటేనే విధులకు క్రమం తప్పకుండా హాజరవుతూ సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తాడని తెలిపారు. గని పరిసరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మైన్స్ కమిటీ సభ్యులు, గని మేనేజర్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. మాన్‌వేకు వచ్చే దారిలో వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని గుర్తించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే డ్రైనేజీ, నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా స్నానాల గదులు, కార్మికులు ఉపయోగించే సాధారణ ప్రదేశాల్లో ప్రతిరోజూ పరిశుభ్రత నిర్వహించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గని మేనేజర్ శ్యాంప్రసాద్, ఎస్ఓ అనిల్ సాగర్, ఎల్‌హెచ్‌డీ మరియు కామన్ సెక్షన్ ఇంచార్జి శ్రవణ్, యాక్టింగ్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్, ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్, మైన్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సందీప్, సుమన్, సురేందర్ రెడ్డి, దేవుసింగ్, కె.రాంచందర్, శశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దత్తాయపల్లిలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : వనపర్తి మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శుక్రవారం మార్నింగ్ వాక్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని వీధుల వెంబడి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మొదలుకొని పాఠశాల, అంగన్వాడి కేంద్రం, చెరువు కట్ట, క్రీడా ప్రాంగణం తాగునీటి ప్లాంటు, సిసి రోడ్లు మురికి కాలువలు, ఆలయ నిర్మాణ స్థలం, పంటలు ఆరబోసుకునేందుకు సీసీ బెడ్ నిర్మాణానికి స్థల పరిశీలనతో పాటు తండాలల్లోనూ ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చూస్తున్నాము కాని ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన పాపన పోలేదని నేడు వనపర్తి శాసనసభ్యులుగా మీరు మా గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉందని వారు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ వెంకటయ్య గ్రామంలో చేపట్టవలసిన పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో గుర్తించిన సమస్యలను వెంటనే బహిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తన వెంట మార్నింగ్ వాక్ లో పాల్గొన్న అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం మోటార్ సైకిల్ పై సమీపంలోని తాండాలకు వెళ్లి తాండవాసులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి మండల అధ్యక్షులు రవికిరణ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, సర్పంచ్ వాల్య నాయక్, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకులు ఎందరో మారిన వ్యవసాయ కార్మికుల జీవితాలలో మార్పు రావడం లేదు

గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : పాలకులు ఎందరు మారిన వ్యవసాయ కార్మికుల జీవితాలలో మార్పు రావడంలేదని, తమ హక్కుల సాధనకై వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని మేదరమెట్ల సీతారామయ్య భవన్ లో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా మూడవ మహాసభల ఆహ్వాన సంఘం సన్న హక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో పని లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని అన్నారు. వలసల నివారణ కోసం యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వి బి జి రామ్ జి పేరుతో తీసుకొచ్చిన నూతన ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. ఉపాధి కూలీలను ఉపాధి పనులకు దూరం చేసేందుకు ప్రభుత్వం రెండు పూటలా ఫోటో విధానాన్ని తీసుకువచ్చిందని దీని మూలంగా ఫోటోలు పడక చాలామంది పని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేవైసీ పేరుతో అనేక జాబ్ కార్డులను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలలో ప్రభుత్వ భూమి ఉందని ప్రభుత్వానికి పేద వ్యవసాయ కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే ప్రతి భూమి లేని కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున ఇవ్వవచ్చన్నారు. వ్యవసాయ కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

*** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా మూడవ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు**

జూన్10,11 తేదీలలో గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా మూడో మహాసభల అవగాహన సంఘం గౌరవ అధ్యక్షులుగా జూలకంటి రంగారెడ్డి,




అధ్యక్షులుగా రావిరాల సుందరయ్య (రిటైర్డ్ ఎస్సై ) ఉపాధ్యక్షులుగా ములకలపల్లి రాములు, పారేపల్లి శేఖర్ రావు, నాగారపు పాండు, ప్రధాన కార్యదర్శిగా మట్టిపల్లి సైదులు, సహాయ కార్యదర్శిగా పులుసు సత్యం, జంపాల స్వరాజ్యం, సిరికొండ శ్రీను, పోసనబోయిన హుస్సేన్, పటాన్ మహబూబ్ అలీ, సహాయ కార్యదర్శిగా షేక్ యాకూబ్, కొదమగుండ్ల నగేష్, కందగట్ల అనంత ప్రకాష్, పాండు నాయక్, వట్టపు సైదులు, బాలు నాయక్ కోశాధికారిగా దోసపాటి భిక్షం ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, సిఐటియు మండల కన్వీనర్ షేక్ యాకూబ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జంపాల స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీను, పోసనబోయిన హుస్సేన్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు తుమ్మల సైదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పటాన్ మహబూబ్ అలీ, దోసపాటి బిక్షం తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**– న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరారవు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:వ్యవసాయ రంగాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పడం కోసమే నూతన చట్టాలను తీసుకువస్తుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. న్యూడెమోక్రసీ పాల్వంచ మండల మహాసభ శుక్రవారం రెడ్డిగూడెంలో కళింగరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య వక్తగా గౌని నాగేశ్వరావు పాల్గొని ప్రసంగిస్తూ దేశంలో నరేంద్ర మోడీ వచ్చాక వ్యవసాయ రంగాన్ని ప్రధాన టార్గెట్ చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో రైతులు ఏయే పంటలు పండించాలో కూడా నరేంద్ర మోడీ అమెరికా చెప్పినట్టుగా రుద్దుతున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులు పండించిన పంటలు తడిసి మార్కెట్‌లో అమ్ముడుపోక బయట దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత కందాల బుచ్చిరెడ్డి జెండావిష్కరణ చేయగా, ఉప్పరబోయిన రామ్మూర్తి అమరవీరుల సంతాప తీర్మాణం, కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఉప్పరబోయిన రామ్మూర్తి, కళింగ రెడ్డి, బుచ్చిరెడ్డి, బత్తుల నాగరాజు, కొమరం మల్లేష్, తూము రాజయ్య, ముత్తమ్మ, మణెమ్మ, అంజలి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ,ప్రజాస్ఫూర్తి : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి ప్రజల్లో పొగాకు వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో 31వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యం లో జిల్లా స్థాయి




సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ సిగరెట్ల,ఇతర పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం (సిఓటిపిఏయాక్ట్) అమలు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పొగాకు రహిత సమాజం కోసం సమిష్టి గా కృషి చెయ్యాలని అన్నారు. ఈ సమావేశం లో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు,డిపి ఓ వెంకట్ రెడ్డి, డీఏఓ అంబికా సోనీ, డీ ఆర్డీఓ భాస్కర్,డ్రగ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటా

*** ఎమ్మెల్యే మేఘారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా. : వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఆడపడుచుకు నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో శాసన సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికై అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 7 2023న ప్రభుత్వం ఏర్పాటు అయినా వెంటనే మొదటగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేసేందుకు మొదటి సంతకం చేసిందన్నారు. ఆరోగ్య భీమాను 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచడం జరిగిందని అదేవిధంగా జిల్లాలో 30 వేల తెల్ల రేషన్ కార్డులు కొత్తగా ఇచ్చినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా అన్ని పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించి ఆర్థిక సాధికారతకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు. అనంతరం శాసన సభ్యుల చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు రూ. 3.40 కోట్ల బ్యాంక్ లింకేజ్ చెక్కును, మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ కిమ్యానాయక్, మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కదిరి రాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్లు, ఎన్ ఎస్ యు ఐ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 'క్యూర్' పరిధిలో ఫ్లాట్ల నిర్మాణానికి

# తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్: 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ఫ్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ఫ్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్ఐజీ ఫ్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ

దిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్టు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి.. తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమీర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి



అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.



# ఐవరీ చీరలో అప్సరసలా జాన్వీ

యువ నటి జాన్వీ కపూర్ తన రాబోయే చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా తన స్టైలిష్ లుక్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా ప్రత్యేకంగా రూపొందించిన ఐవరీ రంగు చీరలో ఆమె అచ్చం దేవకన్యలా కనిపించి ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకుంటూ, "హెలో ఫ్రమ్ యువర్ జాను పాపా" అంటూ సరదా క్యాప్షన్‌ను జోడించారు. సున్నితమైన ఎంబ్రాయిడరీతో, షీర్ ఫ్యాబ్రిక్‌పై డిజైన్ చేసిన ఈ చీరలో ఆమె అప్సరసను తలపించారు. ఈ చీరకట్టులో డ్రామాటిక్ కేప్-స్టైల్ పల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జత చేసిన స్కాల్ప్‌డ్ లేస్ బోర్డర్లు సంప్రదాయానికి ఆధునికతను జోడించాయి. దీనికి మ్యాచింగ్‌గా హెవీ ఎంబ్రాయిడరీతో కూడిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ బ్లౌజ్‌ను ధరించారు. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం తెరకెక్కుతోంది. ఈ యాక్షన్ డ్రామాకు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 4న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో జాన్వీ తన ఎథ్నిక్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో స్టైల్ చేసిన ఈ లేటెస్ట్ లుక్, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

# 'పెద్ది' ప్రీ రిలీజ్ ఈవెంట్

## వేదిక, తేదీ ఖరారు



రామ్‌చరణ్ అభిమానులకు 'పెద్ది' టీమ్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రీ రిలీజ్ ఈవెంట్ వివరాలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. జూన్ 1న సాయంత్రం ముందస్తు విడుదల వేడుక నిర్వహించనున్నట్టు తెలిపింది. విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియం ఈ ఈవెంట్‌కు వేదిక కానుంది. 'పెద్ది'కి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలి, భారీ ఈవెంట్. జూన్ 4న సినిమా రిలీజ్ కానుంది. జూన్ 3న ప్రీమియర్స్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చింది. తెలంగాణలోనూ స్పెషల్ షోలు ప్రదర్శించే అవకాశాలున్నాయి. ఇక, మిగిలింది జూన్ 2 మాత్రమే. తెలంగాణలో ఆ తేదీన.. ఈవెంట్‌కు బదులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్టు సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబట్టి.. టీమ్ ఇప్పటికే భోపాల్, బెంగళూరు, ఢిల్లీలో ప్రమోషన్స్ చేసిన సంగతి తెలిసిందే.

# 'రాఖ్' స్ట్రీమింగ్ విడుదల తేదీ ఇదే!





ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు మరో వెబ్‌సిరీస్ సిద్ధమైంది. తాజాగా దాని విడుదల తేదీ ఖరారైంది. ఆ సిరీసే.. 'రాఖ్' 'అమెజాన్ ప్రైమ్ వీడియో' లో జూన్ 12 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రైమ్ ఒరిజినల్‌గా రూపొందిన ఈ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సిరీస్‌లో 'మీర్జాపూర్' ఫేమ్ అలీ ఫజల్ ప్రధాన పాత్ర పోషించారు. సోనాలీ బింద్రే, ఆమిర్ బషీర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. 'పాతాళ్‌లోక్'తో థ్రిల్ చేసిన ప్రొసిత్ రాయ్ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ఇందులో అలీ ఫజల్ పవర్‌ఫుల్ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఇద్దరు టీనేజర్ల మిస్సింగ్ కేసును పోలీసు ఆఫీసర్ ఎలా చేధించాడన్నది క్లుప్తంగా ఈ సిరీస్ కథాంశం. పలు వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సిరీస్‌ని రూపొందించినట్టు సమాచారం.

**సైలెంట్‌గా రిలీజైన 'గోదారి గట్టుపైన'**


ఇదే ఓటీటీ (అమెజాన్ ప్రైమ్ వీడియో)లోకి 'గోదారి గట్టుపైన' ఎలాంటి ప్రచారం లేకుండా సైలెంట్‌గా వచ్చేసింది. ఈ మూవీ శుక్రవారం (మే 29) నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ హీరో హీరోయిన్లు. జగపతి బాబు, లైలా కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఇప్పటికే థియేటర్లలో సందడి చేసిన సంగతి తెలిసిందే. ఇంజినీరింగ్ చదువుతున్న తన కూతురు ఓ ఆటోడ్రైవర్‌ని ప్రేమించిందని తెలిసిన ఓ తండ్రి ఏం చేశాడు? కూతురు ప్రేమని అంగీకరించాడా? తనకు నచ్చినట్టుగానే మరొకరితో పెళ్లి జరిపించాడా? అన్నది చిత్ర కథ.

# కరణ్ జోహార్ క్లారిటీ

## స్టార్స్‌ను అన్‌ఫాలో చేయడంపై స్పందన




బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ తన ఇన్‌స్టా ఖాతాలో పలువురు సెలబ్రిటీలను అన్‌ఫాలో చేయడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. షారుక్ ఖాన్, ఆలియా భట్, అనన్యా పాండే, కరీనా కపూర్, మనీష్ మల్హోత్రాతో పాటు మరికొందరు ప్రముఖులను ఇప్పుడు ఆయన ఫాలో అవట్లేదు. దీంతో నెట్టింట రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. తాజాగా వాటిపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ చిన్న విషయాన్ని పెద్దది చేసి చూపిస్తున్న సోషల్ మీడియా తీరుపై కరణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలబ్రిటీలను అన్‌ఫాలో చేయడాన్ని పెద్ద జాతీయ వార్తగా మార్చొద్దని కోరారు. "ఇది కేవలం ఒక డిజిటల్ డిటాక్స్ అంతే. ఇన్‌స్టాలో నేను ఎక్కువ టైమ్ గడపుతున్నాను. దీంతో విలువైన సమయం వృథా అవుతోంది. దీన్ని తగ్గించుకునేందుకే అందరినీ అన్‌ఫాలో చేస్తున్నాను. ఇది ఏమాత్రం జాతీయ వార్త కాదు.. దయచేసి మీ క్లిక్స్ కోసం ఇలాంటి వాటిని సెన్సేషన్ చేయకండి. మీకు వ్యూస్ కావాలంటే మరేదైనా చూసుకోండి. ఇది అనవసరమైన విషయం" అని తెలిపారు. ప్రస్తుతం కరణ్ తన అధికారిక ఇన్‌స్టాలో 78 మందిని ఫాలో అవుతున్నారు. అయితే, చాలా మంది స్టార్స్‌ను అన్‌ఫాలో చేసినప్పటికీ ప్రియాంక చోప్రా ఖాతాను మాత్రం ఆయన అనుసరిస్తున్నారు.




# కుమార్తె వివాహం.. మోదీని ఆహ్వానించిన ఖుష్బూ దంపతులు

ప్రధాని నరేంద్ర మోదీని సినీ నటి, భాజపా నేత ఖుష్బూ కుటుంబం శుక్రవారం దిల్లీలో కలిసింది. తమ కుమార్తె అవంతిక వివాహానికి ఆహ్వానిస్తూ.. ఖుష్బూ, సుందర్ సి దంపతులు శుభలేఖను అందజేశారు. వారితోపాటు అవంతిక, ఆమెకు కాబోయే భర్త శ్రవణ్ శ్రీనివాసన్ కూడా ఉన్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు ఖుష్బూ. ప్రధానితో కలిసి దిగిన ఫొటోను కూడా షేర్ చేశారు. "బిజీ షెడ్యూల్‌లోనూ ప్రధాని మోదీ మాకు సమయం ఇచ్చినందుకు కృతజ్ఞులం. కాబోయే దంపతులను ఆయన ఆశీర్వదించారు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. థాంక్యూ మోదీజీ" అని పేర్కొన్నారు. ఖుష్బూ దంపతుల చిన్న కుమార్తె అయిన అవంతిక నటిగా మలయాళంలో ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆరంభం' అనే చిత్రంలో ఆమె యాక్ట్ చేస్తున్నారు. పెద్ద కుమార్తె ఆనందిత నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



# 'పెద్ది'పై అసత్య ప్రచారం.. ఇద్దరిపై కేసు!

'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది.



# నాగచైతన్య ఫొటోల వినియోగంపై ఢిల్లీ హైకోర్టు ఆంక్షలు

తన వ్యక్తిగత గోప్యతను, హక్కులను కాపాడాలని కోరుతూ టాలీవుడ్ హీరో నాగచైతన్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తన అనుమతి లేకుండానే తన పేరును, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. నాగచైతన్య అభ్యర్థనపై ఢిల్లీ హైకోర్టు సానుకూలంగా స్పందించింది. నాగచైతన్య అనుమతి లేకుండా ఆయన పేరు, ముఖ రూపం, స్వరాన్ని వాణిజ్యపరంగా వాడకూడదని తీర్పును వెలువరించింది. నాగచైతన్య వ్యక్తిగత హక్కులను పరిరక్షిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలువురు సినీ స్టార్లు ఢిల్లీ హైకోర్టు నుంచి ఇదే రకమైన రక్షణ పొందిన సంగతి తెలిసిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.